క్లుప్తంగా

మన సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవి



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న వెంకటరమణ

సారవకోట: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవని ప్రవచనకర్త బోయిన వెంకటరమణ అన్నారు. మండలంలోని కిన్నెరవాడ గ్రామంలో గల పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో అర్చకులు సిద్ధయ్య స్వామి ఆధ్వర్యంలో మంగళవారం ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ.. మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి మార్గదర్శకాలని, వీటిని ప్రతి ఒక్కరూ ఆచరించి, పాటించాలన్నారు. ప్రతీ గ్రామంలో ఆధ్యాత్మిక సత్సంగాలు ఏర్పాటు చేయాలని, దీని వలన భక్తిభావం పెరుగుతుందన్నారు. పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పదనాన్ని తల్లిదండ్రులు తెలియజేయాలన్నారు. జయేంద్రనాథ్ సాహు, గొలివి మోహన్‌రావు, పిట్ల సోమేశ్వరరావు, తదితరులు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు.

వరి పంట పొలాల పరిశీలన



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

హిరమండలం: వరదలతో జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిస్తామని మండల వ్యవసాయశాఖ అధికారి బి.సంధ్య అన్నారు. మండలంలో సుమారు 400 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు తెలిపారు. మంగళవారం అవలంగిలో వరద నీటిలో మునిగిన పంట పొలాలను పరిశీలించారు. కొన్ని పొలాల్లో పంట నేలకొరిగి బురదలో కూరుకుపోయి నష్టం జరిగిందన్నారు. వరద బారిన ఉన్న పొలాల్లో సస్యరక్షణ చేపడితే కొంతమేర ఫలితం ఉంటుందన్నారు. సచివాలయ వ్యవసాయ కార్యదర్శులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



పడాల తరుణ్



లండ వినయ్

ఆమదాలవలస: పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు పదో తరగతి విద్యార్థులు స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో సత్తాచాటారని ఉపాధ్యాయులు మంగళవారం తెలిపారు. పడాల తరుణ్ చెస్‌లో, వంద మీటర్ల రన్నింగ్‌లో లండ వినయ్ ఉత్తమ ప్రతిభ చూపారన్నారు. వీరు ఇద్దరూ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, ఆయా జట్లుకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

పొందూరు: శ్రీకాకుళంలో ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లోమండలంలోని రాపాక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికయ్యారు. కొంచాడ గాయత్రి బాలికల విభాగంలో, కొంచాడ విజయ సీతారాం బాలుర విభాగంలో ఎంపికైనట్లు హెచ్‌ఎం సీహెచ్ శారదాంబ మంగళవారం తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం, ఎస్‌ఎంసీ చైర్మన్ కె.శేషగిరిరావు, పీడీ రమణమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు



పెద్దకోరాడలో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వెంకటేష్

హిరమండలం: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం అవుతాయని హిరమండలం ఎస్‌ఐ వెంకటేష్ సూచించారు. మేజర్ పంచాయతీ హిరమండలంలోని పెద్దకోరాడలో సంకల్పం అనే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అపరిచిత వ్యక్తులు తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు విక్రయిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు.

మెయిన్ రోడ్డు అభివృద్ధిపై.. నీలినీడలు..!



అభివృద్ధికి నోచుకోని మెయిన్ రోడ్డు

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కిలో మీటరు మేర పనులు పూర్తి
- మరో రెండు కిలో మీటర్ల మేర పనుల పెండింగ్
- మిగిలిన రోడ్డును అభివృద్ధి చేయాలని కోరుతున్న పట్టణ వాసులు

నరసన్నపేట: నియోజకవర్గ కేంద్రం నరసన్నపేట మెయిన్ రోడ్డు అభివృద్ధిపై నీలినీడలు అలుముకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 17 నెలలు అవుతున్నా.. ఈ రోడ్డు అభివృద్ధిపై కనీస స్పందన లేదు. దీంతో ఈ ప్రభుత్వ కాలంలో మెయిన్ రోడ్డు అభివృద్ధి పూర్తి అవుతుందా? అనే అనుమానం పట్టణ ప్రజల్లో వ్యక్తం అవుతోంది.

పోలాకి కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కాలంలో మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ కృషితో మెయిన్ రోడ్డు అభివృద్ధికి రూ. 4.5 కోట్లు మంజూరయ్యాయి. 2020లో రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభించారు. 80 అడుగుల మేర వెడల్పు చేసి సెంటర్ డివైడర్‌తో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఉన్న నిధులు సరిపోక పోలాకి కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు అనుకున్న ప్రకారం పనులు పూర్తి చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి సత్యవరం కూడలి వరకు, పోలాకి కూడలి నుంచి మార్కెట్ కమిటీ వరకు అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. అప్పట్లో ఈ పనులకు ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసింది. ఈ లోగా సర్వాత్రిక ఎన్నికలు రావడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

పట్టించుకోని కూటమి నాయకులు..

ఎంతో ప్రాధాన్యత కలిగిన మెయిన్ రోడ్డు అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. పోలాకి కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు రోడ్డు ఎంతో సుందరంగా ఉంది. డివైడర్ ఏర్పాటు చేసి సెంటర్ లైటింగ్ పెట్టడంతో పట్టణం రూపురేఖలే మారిపోయాయి. ఈ విధంగా మొత్తం మెయిన్ రోడ్డు అంతా అభివృద్ధి జరిగితే నరసన్నపేట పట్టణం మరింత సుందరంగా ఉంటుంది. ఇప్పటికే పట్టణంలో వివిధ వాణిజ్య బ్యాంకులు, షాపింగ్ మాల్స్ నరసన్నపేటకు వచ్చాయి. సత్యవరం కూడలి నుంచి మార్కెట్ కమిటీ వరకు రోడ్డును పూర్తిస్థాయిలో అభివృద్ధి జరిగితే జిల్లాలో ప్రముఖ వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది.

మెయిన్ రోడ్డు అభివృద్ధి చాలా అవసరం



జిల్లాలో ప్రముఖ వ్యాపార కేంద్రంగా నరసన్నపేట రోజురోజుకూ అభివృద్ధి చెందుతోంది. మెయిన్ రోడ్డు అభివృద్ధి చాలా అవసరం. గత ప్రభుత్వం చేపట్టిన పనులు ఈ కూటమి ప్రభుత్వం పూర్తిచేయాలి. ఇలా మధ్యలో నిలిపివేయడం శోచనీయం. పనులు పూర్తికాకపోవడం వలన డ్రైనేజీ వ్యవస్థ మెయిన్ రోడ్డుకు ఆనుకొని అధ్వానంగా తయారైంది. దీనిని దృష్టిలో పెట్టుకొని కూటమి నాయకులు రోడ్డు అభివృద్ధిపై దృష్టి సారించాలి.

– కేసీహెచ్‌బీ గుప్త, వార్డు సభ్యుడు, నరసన్నపేట

రూ.11 కోట్లుతో ప్రతిపాదనలు పంపాం



మెయిన్ రోడ్డును మరో రెండు కిలో మీటర్లు మేర అభివృద్ధి చేయాలి. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కట్టాల్సి ఉంది. ఈ మేరకు రూ.11 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే పనులు చేపడతాం.

– ఎ.శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ ఏఈ

నాణ్యతలో రాజీ పడొద్దు

- రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్ రెడ్డి



కేజీబీవీలో వంటలను రుచిచూస్తున్న రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్ రెడ్డి

ఆమదాలవలస: ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతపై అధికారులు రాజీ పడొద్దని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్ రెడ్డి అన్నారు. పట్టణంలోని జ్యోతిరావు పూలే వసతిగృహం, జగ్గుశాస్త్రులపేటలోని కేజీబీవీ పాఠశాలను మంగళవారం సందర్శించారు. పాఠశాలల్లోని వంట గదులు, సామగ్రి నిల్వ చేసే గదులు, భోజనశాల, తదితర విభాగాలు, నిత్యావసర సరుకుల నిల్వలు, రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి ఆహార నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. వంటలను రుచి చూశారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఫోర్టిఫైడ్ రైస్‌లో విద్యార్థులకు అవసరమైన విటమిన్లు, ప్రోటీన్లు లభిస్తాయన్నారు. గంజితో కూడిన ఆహారం వండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులు వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి జి.సూర్యప్రకాశరావు, సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు డి.మధుసూదనరావు, డీఈఓ ఎ.రవిబాబు, డీసీఓ వై.యశోదలక్ష్మి, తూనికలు, కొలతల శాఖ అధికారి బలరామకృష్ణ, ఆహార భద్రత అధికారి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ధ్యానం, యోగాతో మానసిక ఆరోగ్యం



ధ్యానంపై శిక్షణ ఇస్తున్న యోగా ఉపాధ్యాయుడు అప్పన్న

నరసన్నపేట: రోజూ క్రమం తప్పకుండా యోగా, ధ్యానం చేయడం ద్వారా మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని జిల్లా కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ పి.రాజశేఖర్ అన్నారు. మండలంలోని సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలను సమగ్ర సర్వశిక్ష ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ నెల 10వ తేదీన మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు రాజశేఖర్ తెలిపారు. పాఠశాల యోగా టీచర్ టి.అప్పన్న విద్యార్థులతో యోగా, ధ్యానం చేయించారు. హెచ్‌ఎం వకులా రత్నమాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

ఆమదాలవలస: ఈ నెల 8వ తేదీన ఆమదాలవలస పట్టణంలోని ఎస్‌బీఐ బ్రాంచ్ ఆవరణలో (రైల్వే స్టేషన్ సమీపం) ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ పి.సుకాంత్ మోహన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు శిబిరం ప్రారంభం అవుతుందన్నారు. పెన్షనర్లు, బ్యాంక్ ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భూముల రీసర్వేపై గ్రామ సభలు

కొత్తూరు: ఈ నెల 9, 10వ తేదీల్లో మండలంలోని కౌశల్యాపురం, పారాపురం రెవెన్యూ గ్రామాల్లో మూడో విడత భూముల రీ సర్వే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.బాలకృష్ణ మంగళవారం తెలిపారు. 9వ తేదీన కౌశల్యాపురం, 10వ తేదీన పారాపురంలో ఉదయం పది గంటలకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పారాపురం గ్రామ సభకు టెక్కలి ఆర్డీఓ హాజరవుతారన్నారు. గ్రామ సభలకు ఆయా రెవెన్యూ గ్రూపులో ఉన్న భూ యజమానులు హాజరుకావాలని కోరారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి



ఆలయ చైర్మన్ సన్యాసిరావును సత్కరిస్తున్న యువకులు

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గ ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆలయ కమిటీ చైర్మన్ ఎ.సన్యాసిరావు అన్నారు. మంగళవారం ఆలయ ఆవరణలో పాతపట్నం యూత్ ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆలయాభివృద్ధికి తమవంతు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సైలాడ సతీష్, లింగాల కిశోర్, కృష్ణారావు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, యువకులు పాల్గొన్నారు.

రహదారులు ఇలా.. ప్రయాణం ఎలా?



చీడివలస వద్ద రహదారి దుస్థితి



శ్రీకాకుళం-పాలకొండ రహదారిలో నామాలక్ష్మీపురం మలుపు వద్ద చెరువును తలపిస్తున్న దృశ్యం



మదనాపురం-సరుబుజ్జిలి రోడ్డులో అన్నంపేట వద్ద ఏర్పడిన గోయ్యి

- ఇసుక లారీలు, ట్రిప్పర్లతో ఛిద్రమైన రోడ్లు
- చినుకు పడితే చిత్తడే
- రోడ్లన్నీ గోతులమయం
- ప్రయాణికుల అవస్థలు



శ్రీకాకుళం-పాలకొండ గ్రామ ప్రధాన రహదారిలో కొల్లివలస కూడలిలో ఏర్పడిన గోతులు



నారాయణపురం గ్రామం వద్ద ఏర్పడిన గోతులు

బూర్జ: నిత్యం ఇసుక లారీలు, ట్రిప్పర్లు, ట్రాక్టర్లు తిరగడంతో పలు రహదారులు ఛిద్రమయ్యాయి. వర్షం కురిస్తే చెరువులను తలపిస్తున్నాయి. పెద్ద, పెద్ద గోతులు ఏర్పడి అధ్వానంగా తయారయ్యాయి. బూర్జ మండలం పరిధిలోని నాగావళి నది నుంచి నిత్యం ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. నారాయణపురం నుంచి కొల్లివలస జంక్షన్ వరకు రహదారి 5 కిలో మీటర్లు ఉంటుంది. ఈ రోడ్డు పూర్తిగా అధ్వానంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులు మరింత దారుణంగా తయారయ్యాయి. పాలకొండ రోడ్డు, మదనాపురం నుంచి సరుబుజ్జిలి పక్కా రోడ్డులో గోతులు ఏర్పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్టు వేయాలని నాగావళి నదీతీర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధిక లోడ్‌తోనే గోతులు



అధిక లోడుల వల్లే రహదారుల్లో గోతులు ఏర్పడ్డాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇసుక ర్యాంపులు మంజూరు చేసింది. రాత్రీ, పగలూ భారీ వాహనాలు రవాణా చేయడంతో రోడ్లు పూర్తిగా పాడయ్యాయి.

– పందిరి వెంకటరావు, కాఖండ్యాం, బూర్జ మండలం

అడ్డుకట్టు వేయాలి



నారాయణపురం, ఖాఖండ్యాం గ్రామాల వద్ద ఉన్న ఇసుక క్వారీల నుంచి అక్రమ రవాణాకు అడ్డుకట్టు వేయాలి. ఇసుక అధిక లోడులతో నిత్యం ప్రయాణం చేయడం వలన నారాయణపురం నుంచి కొల్లివలస వరకు రోడ్డు అధ్వానంగా మారింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

– సోమేటి శ్రీనివాసరావు, మామిడివలస, బూర్జ మండలం.

మరమ్మతులు చేస్తాం

రహదారుల మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదలైన వెంటనే మరమ్మతులు చేపడతాం.

– ఆంజనేయ నాయక్, ఆర్‌అండ్‌బీ జేఈ



నారాయణపురం రోడ్డులో కొల్లివలస వద్ద చెరువును తలపిస్తున్న రోడ్డు

వైఎస్ జగన్‌ను కలిసిన చింతాడ



తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు, తదితర అంశాలపై చర్చించారు. – ఆమదాలవలస

పంట నష్టం ప్రభుత్వానికి పట్టదా?



కొత్తూరు: సోమరాజపురం వద్ద నీటమునిగిన వరి పంట పొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- అన్నదాతలను ఆదుకోవాలి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు/హిరమండలం: వంశధార నదికి వచ్చిన వరదలతో నష్టపోయిన పంటలకు పరిహారం మంజూరు చేయాలన్న ఆలోచన కూటమి ప్రభుత్వానికి లేదని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి అన్నారు. కొత్తూరు మండలంలోని సోమరాజపురం, మదనాపురం, హిరమండలం మండంలోని గులుమూరు, కల్లట, జిల్లేడుపేట, అవలంగి గ్రామాల్లో వరదలతో నష్టపోయిన పంటలను మంగళవారం పరిశీలించారు. వరి, మొక్కజొన్న, తదితర పంటలు పూర్తిగా నష్టపోయినట్లు రైతులు వివరించారు. ఈ సందర్భంగా రెడ్డి శాంతి మాట్లాడుతూ.. వరదలతో నష్టపోయిన పంటలకు పరిహారం అందజేస్తామని ఇంతవరకు ఈ ప్రభుత్వం ప్రకటించకపోవడం దారుణమన్నారు. వరి, అరటి, చెరుకుతో పాటు పలు రకాల కూరగాయల పంటలు పూర్తిగా నీటిలో మునిగి కుళ్లిపోయాయన్నారు. రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. యూరియాను టీడీపీ నేతలే బ్లాక్ మార్కెట్‌కు తరలించి ఒక్కో బస్తా రూ.700 విక్రయిస్తున్నారన్నారు. వరి పంటకు ఎకరాకు రూ.50 వేలు, మొక్కజొన్న, చెరుకు, అరటి పంటలకు ఎకరాకు రూ.లక్ష అందించాలని డిమాండ్ చేశారు. కొత్తూరు మండలం పార్టీ అధ్యక్షుడు గండివలస ఆనందరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్‌లు ధర్మారావు, వెంకటరావు, చల్ల రవికిరణ్, పోలయ్య, హిరమండలం మండలం పార్టీ అధ్యక్షుడు మీసాల వెంకట రామకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి ఏవీ సురేష్, ఎంపీటీసీ సభ్యుడు బెవర గంగాధరరావు, సర్పంచ్ మూకళ్ల చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

వంశధార ప్రాజెక్టు పరిశీలన



వంశధార జలాశయం వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎస్‌ఈ రామచంద్రరావు

హిరమండలం: వంశధార జలాశయం, గొట్టా బ్యారేజీని వంశధార ఎస్‌ఈ రామచంద్రరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ గొట్టా బ్యారేజీ నిర్మించి సుమారుగా 50 ఏళ్లు అవుతోందన్నారు. బ్యారేజీ ఏప్రాన్స్, గేట్లు, పంప్ హౌస్ డిజైన్, అలాట్‌మెంట్, తదితర అంశాలను పరిశీలించినట్లు తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తానన్నారు. ఎడమ ప్రధాన కాలువ పరిధిలో ఉన్న ఓటీలు రాతికట్టుతో నిర్మించడంతో పాడవుతున్నాయన్నారు. కాలువ మరమ్మతులు కొన్నేళ్లుగా చేయలేదన్నారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తానన్నారు. వంశధార ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన



సరుబుజ్జిలి: వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ పద్మావతి

సరుబుజ్జిలి: జీఎస్టీపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. భారత ఆర్థిక వ్యవస్థ, జీఎస్టీ ప్రభావం అన్న అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రిన్సిపాల్ పైడి పద్మావతి పర్యవేక్షించారు. ఈ పోటీలను స్థానిక సచివాలయం సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎస్ పీఓ రమేష్ సాహు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలోని అన్ని జెడ్పీ హైస్కూళ్లలో జీఎస్టీ 2.0పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు మండల ప్రత్యేకాధికారి, పశుసంవర్ధకశాఖ జేడీ జి.నారాయణరావు మంగళవారం తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్, ఉపన్యాసం కార్యక్రమాలపై పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 బి.ధనుంజయరావు పాల్గొన్నారు.

హిరమండలం: జీఎస్టీపై ప్రాథమిక స్థాయి నుంచి అవగాహన ఉండాలని ఎంపీడీఓ కాశీప్రసాదరావు సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జీఎస్టీపై అవగాహన కల్పించారు. అన్నిరకాల వస్తువలపై జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం తగ్గించిందన్నారు. అందుకే నిత్యావసరాలతో పాటు గృహోపకరణాల ధరలు తగ్గాయన్నారు. ఈ సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



పాతపట్నం: విద్యార్థులకు సర్టిఫికెట్లు, షీల్డ్‌లను అందజేస్తున్న ఎంఈఓ గోవిందరావు



సారవకోట: వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీడీపీఓ, తదితరులు

సారవకోట: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో మంగళవారం మహర్షి వాల్మీకి మహాముని జయంతి ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి సీడీపీఓ వంశీప్రియ, కార్యాలయ సిబ్బంది నివాళులర్పించారు. అనంతరం వాల్మీకి రామాయణం రాయడానికి గల కారణాలను తెలియజేశారు. సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: వాల్మీకిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎంఈఓ ఎ.గోవిందరావు అన్నారు. మంగళవారం బ్రాహ్మణవీధి కూడలిలో గల ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి ఎంఈఓ, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, షీల్డ్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. హెచ్‌ఎం ఎస్.వైకుంఠరావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

పొందూరు: మండల కేంద్రంలోని జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్ పీడీ డి.రమాకాంతారావు మంగళవారం పరిశీలించారు. నిర్మాణాల్లో ఉన్న గృహాలకు విడతల వారీగా బిల్లులు మంజూరవుతున్నాయన్నారు. పీజీఆర్‌ఎస్‌లో బిల్లుల మంజూరుపై అందిన ఫిర్యాదుల మేరకు విచారణ చేపట్టారు. హౌసింగ్ డీఈ సన్యాసిరావు పాల్గొన్నారు.